సమస్యలపై పట్టింపు లేదా?

- మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధుల ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపీపీ కమల

బాలానగర్: సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని, చేసిన పనులకు బిల్లులు ఇవ్వడం లేదని ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ కమల అధ్యక్షతన మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఉదయం 10:30గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం 45నిమిషాలు ఆలస్యమైంది. సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గిరిజన కోపరేటీవ్ చైర్మన్ వాల్యానాయక్ హాజరయ్యారు. అనంతరం సభ్యులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

సమస్యలపై నిలదీత..

మన ఊరు–మన బడి కార్యక్రమంలో నిర్మాణం పూర్తయినా కేవలం రూ.లక్ష బిల్లు వచ్చిందని, మిగిలిన డబ్బులు రాలేదని తెలిపారు. మరో గ్రామంలో పనులు పూర్తి కాకుండానే రూ.5లక్షల బిల్లులు వచ్చాయని ఆరోపించారు. క్రీడా ప్రాంగణానికి చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు ఇప్పటి వరకు రాలేదని చెన్నంగుళగడ్డ తండా సర్పంచ్ రవినాయక్ తెలిపారు. 5తరగతులు ఉన్న పాఠశాలకు ఒకే ఉపాధ్యాయుడు ఉన్నాడని వీరన్నపల్లి సర్పంచ్ రాజు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఉపాధ్యాయుడు సెలువు పెడితే పాఠశాలకు కూడా సెలవు ఇవ్వాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉడిత్యాలలో 24గంటలు వీధిదీపాలు వెలుగుతూనే ఉన్నాయని తెలిపారు. ఇళ్లపై ఉన్న విద్యుత్ తీగలు తీయాలని పలుమార్లు చెప్పినా ఎలాంటి పరిష్కారం చూపలేదని బాలానగర్ సర్పంచ్ విజయలక్ష్మి అన్నారు. గిరిజన తండాల్లో 60కి పైగా నూతన విద్యుత్ కనెక్షన్లు ఇప్పిస్తే కేవలం 20 పోల్స్ కూడా ఇవ్వలేదని వీరన్నపల్లి సర్పంచ్ రాజు తెలిపారు. ఉడిత్యాల, సూరారం మధ్యలో ఉన్న నక్షబాటను రైతులు ఆక్రమించి రోడ్డు లేకుండా చేశారని, సర్వేచేసి తగిన చర్యలు తీసుకోవాలని సూరారం సర్పంచ్ పేర్కొన్నారు. సంత బజారులో దుమ్ముతో వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, పనులు పూర్తి చేయాలని ఎంపీపీ కమల ఏఈ హలీంను ఆదేశించారు. సమావేశంలో జెడ్పీటీసీ కల్యాణి, వైస్ ఎంపీపీ వెంకటచారి, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



జడ్చర్లలో సైక్లింగ్ ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి



భూత్పూర్‌లో..

జడ్చర్ల టౌన్: ప్రస్తుత యాంత్రీకరణ జీవన విధానంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరముందని, అరగంట సైక్లింగ్ చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో అర్బన్ హెల్త్‌సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సైక్లింగ్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కుమ్మరి రాజు, బుక్క మహేష్, అర్బన్‌హెల్త్ సెంటర్ డాక్టర్ శివకాంత్ పాల్గొన్నారు.

సైకిల్ ర్యాలీ..

మిడ్జిల్: మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు మనుప్రియా ఆధ్వర్యంలో సైకిల్‌ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గౌస్, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య, నాయకులు పర్వతాలు, భీమయ్య, వైద్య సిబ్బంది జంగయ్య, దేవయ్య, గీత ఉన్నారు.

భూత్పూర్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యం కోసం సైకిల్, నడక తప్పనిసరి చేయాలని సీహెచ్ఓ రామయ్య అన్నారు. మంగళవారం భూత్పూర్ చౌరస్తాలో మండల స్థాయి అధికారులు, మండలంలోని తాటికొండలో ఉన్నతపాఠశాల విద్యార్థులు సైకిల్ మరథాన్ నిర్వహించారు.

చిన్నచింతకుంట: సైకిల్ తొక్కడం ద్వారా ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుందని తహసీల్దార్ సువర్ణరాజు, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

కేంద్ర నిధులతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు జితేందర్‌రెడ్డి

పాలమూరు: ప్రజాగోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని పద్మావతి కాలనీలో కార్నర్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు జితేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. జడ్చర్ల నుంచి రాయిచూర్ వరకు జాతీయ రహదారితో పాటు అప్పన్నపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులు కేంద్రం నిధులతో చేపడుతున్నట్లు తెలిపారు. పాలమూరులో భూ కబ్జాలు, అరాచక పాలన కొనసాగుతుందన్నారు.

అడ్డాకుల: ప్రజా వ్యతిరేక పాలన కొనసాగుతోందని, కాంగ్రెస్ వస్తేనే నిరుపేదల సంక్షేమం సాధ్యమవుతుందని కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లిలో హాత్‌సే హాత్ జోడో కార్యక్రమంలో భాగంగా మంగళవారం టీపీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి కొండా ప్రశాంత్‌రెడ్డితో కలిసి గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు.

మిడ్జిల్: మండలంలోని వాడ్యాల్‌లో గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్ ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు.

గ్రంథాలయ పనివేళలు పొడిగించండి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మెంబర్‌షిప్‌ను పెంచాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా గ్రంథాలయంలో ఆయన సిబ్బందితో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. గ్రంథాలయాన్ని ప్రతి రోజూ సందర్శించే సంఖ్య కూడా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే పాఠకులకు ఎటువంటి అసౌకర్యాలు కగలకుండా అన్ని చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అభ్యర్థుల వినతి మేరకు సమయాన్ని ఉదయం 7నుంచి రాత్రి 9గంటల వరకు పెంచుతున్నట్లు తెలిపారు. ఇందుకు అనుగుణంగా సిబ్బంది పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి మనోజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అమరవీరులకు ఘన నివాళి



మౌంట్‌బాసిల్ పాఠశాలలో రక్తదానం చేసిన సిబ్బంది

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మండలంలోని తిరుమల హిల్స్ వద్ద ఉన్న మౌంట్‌బాసిల్ పాఠశాలలో మంగళవారం పుల్వామా దాడి అమరులకు నివాళిగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రెడ్‌క్రాస్ సంస్థ సహకారంతో చేపట్టిన కార్యక్రమంలో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పూజిత మోహన్‌రెడ్డి మాట్లాడుతూ జవాన్ల ప్రాణ త్యాగాలను గుర్తెరిగి నివాళిగా రక్తదాన శిబిరంలో పాల్గొన్న సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ చంద్రకళా వెంకటయ్య, కోశాధికారి శిరీష ప్రవీణ్, సుశాంత్ కృష్ణ, లయన్ నటరాజ్, ప్రిన్సిపాల్ ఇందుమతి పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: పుల్వామా దాడిలో మృతిచెందిన జవాన్లకు మంగళవారం రాత్రి పట్టణంలోని నేతాజీ చౌరస్తాలో కొవ్వొత్తులతో ఘనంగా నివాళులర్పించారు. అనురాగిణి అరక్షిత నిలయంలో బాలలు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు.

రాజాపూర్: పుల్వామాలో దాడిలో వీరమరణం పొందిన జవాన్లకు మండల కేంద్రంలో మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. 400మీటర్ల జాతీయ జెండాతో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్మీ జవాన్ల యూనియన్ మండల అధ్యక్షుడు నరేందర్, ప్రధాన కార్యదర్శి సయ్యద్, ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

మిడ్జిల్: పుల్వామా ఉగ్ర దాడిలో ప్రాణాలు కోల్పోయిన వీర జవాన్లకు నివాళులర్పిస్తూ మండల కేంద్రంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో జాతీయ జెండాతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ రామ్‌లాల్‌నాయక్, నాయకులు రాజేశ్వర్, తిరుపతి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



రాజాపూర్‌లో భారీ జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, నాయకులు

నవాబుపేట: పుల్వామ ఉగ్రదాడిలో అమరులైన వీరజవాన్లకు మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం కొవ్వొత్తులతో నివాళులర్పించారు.

మహాకుంభాభిషేక బ్రహ్మోత్సవాలు



పూజలు చేస్తున్న పూజారులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం వెంకటేశ్వర కాలనీలోని శ్రీమాతా రాజరాజేశ్వరి మందిరం–షిరిడీసాయి మందిరంలో మంగళవారం మహాకుంభాభిషేక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గురువందనం, గణపతి పూజ, స్వస్తిపుణ్యాహవచనం, గోపూజ, పంచగవ్య ప్రాశనం తదితర పూజలు చేశారు. అమ్మవారి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈనెల 17వరకు నిర్వహించనున్నట్లు మందిర కమిటీ ప్రతినిధులు తెలిపారు.

విగ్రహ ప్రతిష్ఠాపన

బాలానగర్: మండలంలోని తిరుమలగిరి బాల్యానాయక్ తండాలో ప్రతిష్ఠించిన జగదంబా దేవి, సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం మంగళవారం కనుల పండువగా జరిగింది. కార్యక్రమంలో జెడ్పీటీసీ కల్యాణి, గిరిజన రాష్ట్ర నాయకులు లక్ష్మణ్‌నాయక్ సేవాలాల్ మహరాజ్, జగదాంబ దేవి అమ్మవారికి పూజలు చేశారు.

జడ్చర్ల టౌన్: పట్టణ శివారులోని ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో ప్రతిష్ఠాపన మహోత్సవాలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. అయ్యప్పసేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో మొదటి రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో షాసాబ్‌గుట్ట దర్గా గంధోత్సవం



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం షాసాబ్‌గుట్టలో గల హజ్రత్ సయ్యద్ మర్దాన్ అలీషా దర్గా ఉర్సు ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి గంధోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. గంధోత్సవాన్ని షేక్ మొహియొద్దీన్ ఇంటి నుంచి వన్‌టౌన్, న్యూటౌన్‌ల మీదుగా దర్గా వరకు తీసుకెళ్లారు. ఈ ఉర్సు ఊరేగింపులో భక్తులు భక్తిగీతాలు ఆలపించారు. అనంతరం దర్గాలో చాదర్లు, పూలు సమర్పించి ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్గాలో ప్రార్థనలు చేశారు. మర్దాన్‌అలీ షా ఉర్సు వేడుకల్లో రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. అనంతరం మంత్రిని దర్గా నిర్వాహకులు ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో దర్గా పీఠాధిపతి సయ్యద్ అబ్దుల్ రజాక్‌షా ఖాద్రీ, మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ రహెమాన్, అఫ్రోజ్‌షా, వాసిఫ్‌షా, జఫర్‌షా, కౌన్సిలర్ షబ్బీర్, అన్వర్, పాష, మోసీన్, ముజంబిల్, అహ్మదుద్దీన్ పాల్గొన్నారు.

శివభక్తుల ఇరుముడి

మిడ్జిల్: శివదీక్ష మాలధారణ చేసిన భక్తులు సోమవారం మండల కేంద్రంలోని శివాలయం వద్ద మహాపడి పూజ ఘనంగా నిర్వహించారు. అనంతరం ఇరుముడి కార్యక్రమం, అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. సాయంత్రం పాదయాత్ర చేస్తూ శ్రీశైలం బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ గౌస్, గురుస్వాములు మల్లేష్, నరేందర్ హరిగౌడ్, కృష్ణ, శివ, శేఖర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా..



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా జనరల్ ఆస్పత్రి సమీపంలో మంగళవారం మిషన్ భగీరథ పథకం మెయిన్ పైప్‌లైన్ ఎయిర్ వాల్వ్ వద్ద వాచర్ ఫెయిల్ అయింది. దీంతో సుమారు ఐదు గంటల పాటు తాగునీరు వృథాగా రోడ్డు వెంట పారింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ సిబ్బంది బాగుచేశారు.

క్లుప్తంగా

సుష్మాస్వరాజ్‌కు ఘన నివాళి



మిడ్జిల్: కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ నాయకురాలు సుష్మాస్వరాజ్ జయంతిని సోమవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఏర్పాటుకు పార్లమెంట్‌లో కృషిచేసిన నాయకురాలు సుష్మాస్వరాజ్ సేవలు మరువలేనివని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేశ్వర్ అన్నారు.

తెగుళ్ల నుంచి పంటలను కాపాడుకోవాలి



రాజాపూర్: మొక్కజొన్నలో కత్తెర పురుగు, వరిలో మొగిపురుగు పంటలను ఆశించి పాడు చేస్తుందని తెగుళ్ల నుంచి రైతులు పంటలను కాపాడుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి నరేందర్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రాయపల్లి, రాజాపూర్ గ్రామాల్లో రైతులు సాగుచేసిన వరి, మొక్కజొన్న పంటలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



మిడ్జిల్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా టీఎస్ యూటీఎఫ్ బలపర్చిన మాణిక్‌రెడ్డికి మొదటి ప్రాధన్యత ఓటు వేయాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంతో పాటుగా బోయిన్‌పల్లి, అయ్యవారిపల్లి, వస్పుల ఉన్నత పాఠశాలలో ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం చేసే మాణిక్‌రెడ్డికి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కృష్ణయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహులు, జిల్లా కార్యదర్శి మన్నెం, మండల ప్రధాన కార్యదర్శి వెంకటయ్య తదితరులు ఉన్నారు.

కాటేపల్లిని అధిక మెజార్టీతో గెలిపించాలి

మహమ్మదాబాద్: ఎమ్మెల్సీగా ఉపాధ్యాయులకు ఎన్నో సేవలు అందించిన కాటేపల్లి జనార్దన్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా బుధవారం మండలంలోని కస్తూర్బా, గురుకుల, మహమ్మదాబాద్ తదితర పాఠశాలల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు బాల్‌రాజ్, రాష్ట్ర సహాయ అధ్యక్షుడు విజయభూషన్, రాంచందర్ రాథోడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కేశవులు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డితదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కోయిల్‌కొండ: మండలంలో జయనగర్‌తండా, సంగనోనిపల్లి గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణ పనులను మంగళవారం జెడ్పీటీసీ విజయ్ భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, భీంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మల్లయ్య పాల్గొన్నారు.

బహుజనులు రాజ్యాధికారం సాధించాలి

రాజాపూర్: జనాబాలో 80శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలు, మైనార్టీలు అందరూ ఏకతాటిపైకి వచ్చి చరిత్రను తిరగరాయాల్సిన అవసరం ఎంతైన ఉందని బీఎస్పీ మండల అధ్యక్షుడు యాదగిరి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో బహుజనులు తక్కువ శాతం ఉన్న అగ్రవర్ణాల చెప్పుచేతల్లో నడవాల్సిన దుస్థితి నెలకొందని తెలిపారు. అందరం కలిసి కట్టుగా పనిచేసి బహుజన రాజ్యాధికారం దిశగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

చెక్కు అందజేత

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రానికి చెందిన శ్రీనివాసులుకు సీఎంఆర్ఎఫ్ కింద మంజురైన రూ.2లక్షల చెక్కును మంగళవారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ బాధితుడికి అందజేశారు. అనంతరం జిల్లా కేంద్రంలోని మంత్రి ఫాంహౌజ్‌లో మంత్రి తండ్రి నారాయణగౌడ్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆయన సమాధి వద్ద కుటుంబ సభ్యులతో నివాళులర్పించారు.

వ్యక్తికి జైలుశిక్ష

మహమ్మదాబాద్: మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన ఓ వ్యక్తిని కోర్టులో హాజరుపర్చగా, 10రోజుల జైలు, రూ.2వేల జరిమానా విధించినట్లు ఎస్ఐ సైదయ్య తెలిపారు. మహమ్మదాబాద్ మండలానికి చెందిన ఓ వ్యక్తి మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడగా, మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్జి ఎదుట హాజరుపర్చగా, న్యాయమూర్తి 10రోజుల జైలుశిక్ష, రూ.2వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

అంతర్జాతీయస్థాయిలో పతకాలు అభినందనీయం



విద్యార్థులను సన్మానించిన మాస్టర్లు

మహబూబ్‌నగర్ క్రీడలు: డ్రాగన్ షోటోకాన్ కరాటే డూ ఇండియా విద్యార్థులు అంతర్జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించడం అభినందనీయమని ఫౌండర్ సాలం బిన్ ఉమర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నంలో ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు జరిగిన ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించి జిల్లా కేంద్రానికి చేరుకున్న డ్రాగన్ షోటోకాన్ మహబూబ్‌నగర్ విద్యార్థులను మంగళవారం రైల్వేస్టేషన్ ఆవరణలో ఘనంగా సన్మానించారు. విద్యార్థులు ఆర్.సాయినాథ్‌రెడ్డి (బంగారు పతకం), కె.మహిధర్ (రజత పతకం), మనో వికాస్, సింధూర (కాంస్య పతకాలు)లను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సాలం బిన్ ఉమర్ మాట్లాడుతూ కరాటే విద్యార్థులను జాతీయ, అంతర్జాతీయస్థాయిలో తీర్చిదిద్దడమే డ్రాగన్ షోటోకాన్ క్లబ్ లక్ష్యమని అన్నారు. గతంలో పలు సార్లు జాతీయ, అంతర్జాతీయ కరాటే టోర్నీలో డ్రాగన్ షోటోకాన్ విద్యార్థులు పతకాలు సాధించారని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకట్రాములు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి జాన్‌సుందర్, అభిలాష్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఫౌండర్ సరోజనమ్మ, పీటర్, డ్రాగన్ షోటోకాన్ మహబూబ్‌నగర్ అర్బన్ అధ్యక్షుడు, మాస్టర్ ఎస్‌కే మోసీన్, కె.రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన



వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

జడ్చర్ల: విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు, ఆర్టిజన్ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని విద్యుత్ ఉద్యోగుల సంఘం జడ్చర్ల డివిజన్ అధ్యక్షుడు ఎండీ నిజామొద్దీన్ డిమాండ్ చేశారు. మంగళవారం సమస్యల పరిష్కారం కోసం స్థానిక డీఈ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సంబంధిత అధికారులకు అందజేశారు. పీఆర్‌సీని అమలు చేయాలని, అర్హత కలిగిన వారికి జేఎల్ఎం, జూనియర్ అసిస్టెంట్, సబ్ ఇంజనీర్ పదోన్నతులు కల్పించాలని తెలిపారు. స్టాండింగ్ ఆర్డర్స్‌ను రద్దు చేసి ఒకే సంస్థలో ఒకే సర్వీస్ రూల్స్‌ను వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి రమేశ్‌గౌడ్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జయంతిని విజయవంతం చేయండి

నవాబుపేట: గిరిజనుల ఆరాధ్యదైవం సంత్‌సేవాలాల్ జయంతిని బుధవారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు ఉత్సవ సమితి అధ్యక్షుడు లింబ్యానాయక్, కమిటీ గౌరవ అధ్యక్షుడు చందర్‌నాయక్, శంకర్‌నాయక్‌లు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని బంజార భవన్‌లో వారు మాట్లాడుతూ మండల కేంద్రంలోని బంజార భవన్ ఆవరణలో సేవాలాల్ జయంతి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిలు హాజరైతున్నట్లు వివరించారు. సమావేశంలో గిరిజన నాయకులు రాజునాయక్, లింబ్యానాయక్, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధికార ప్రతినిధిగా శ్యాముూల్



బీడీ శ్యాముూల్

స్టేషన్ మహబూబ్‌నగర్: వైఎస్సార్ తెలంగాణ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా జడ్చర్ల నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకుడు బీడీ శ్యాముూల్ నియమితులయ్యారు. ఈ మేరకు సామ్యుల్‌ను జిల్లా అధికార ప్రతినిధిగా నియమిస్తూ వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల ఆదేశాల మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు మండడి సరోజ్‌రెడ్డి నియామక ఉత్తర్వులు జారీచేశారు.

తల్లిదండ్రులు దేవుళ్లతో సమానం



తల్లిదండ్రులను పూజిస్తున్న విద్యార్థులు

గండేడ్: జన్మనిచ్చిన తల్లి దండ్రులు దేవుళ్లతో సమానమని హెచ్‌ఎం చంద్రకాంత్, రామలింగం స్వామిజీ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రుసుంపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు తల్లిదండ్రులకు పాదుకపూజ నిర్వహించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు గ్రామస్తులు, ఉపాధ్యాయుల సమక్షంలో తల్లిదండ్రులకు పూలమాలలు వేసి సన్మానించారు. అనంతరం కాళ్లు కడిగి పాదుకపూజ నిర్వహించారు. తల్లిదండ్రుల ఆశలను వమ్ము చేయకుండా విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శిరీష, పవన్‌స్వామిజీ, రమేష్ స్వామిజీ, ఎస్ఎంసీ చైర్మన్ వెంకటయ్య, ఆశన్న, శ్రీకాంత్, గోపాల్, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

దేవరకద్ర: మండల కేంద్రంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం సంప్రదాయ వంటకాలపై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఇంటెక్ ఆధ్వర్యంలో ఖాన ఖజాన హెరిటేజ్ ఫుడ్ కార్యక్రమంలో భాగంగా ఈ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, హెచ్‌ఎం చంద్రకళ, నిర్వాహకులు శ్రీనివాసరావు, వీఆర్ ప్రసాద్, వెంకట్రాంరెడ్డి, నాగేందర్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్యం వెంటనే స్పందించాలి

బాలానగర్: మండలంలోని గుండేడ్‌లో గ్రామస్తుల ధర్నాకు జెడ్పీటీసీ కల్యాణి, బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింహులు మంగళవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి సమీపంలో ఉన్న మహవీర్ పరిశ్రమ నుంచి తీవ్ర వాయు కాలుష్యం వెదజల్లుతుందని, ఏళ్లుగా యాజమాన్యంతో చర్చించినా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. పరిశ్రమను గ్రామం నుంచి తొలగించాల్సిందేనని తెలిపారు. కార్యక్రమంలో యాదిరెడ్డి, లక్ష్మయ్య, చెన్నారెడ్డి, రాఘవేందర్ ఉన్నారు.

ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

చిన్నచింతకుంట: ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ భాగ్యలక్ష్మారెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని కురుమూర్తి స్వామి దేవస్థానం సమీపంలో ఆత్మకూర్–దేవరకద్ర రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించి ప్రమాదాల బారి నుంచి రక్షించుకోవాలన్నారు.